MAKAM GANGADHAR NETHA
President (GHMC)
Telangana Building Planners Association
E-mail ID : sriswamiplanners@gmail.com
GHMC hmda Growing Global TS-bPASS
SRI SWAMI ASSOCIATES
ARCHITECTS • ENGINEERS • SURVEYORS
We Undertake Building Plans, Lay-Out Plans & Permissions, LRS, BRS, Tax Assesments
వాస్తుకి బిల్డింగ్ ప్లానింగ్, నక్ష చేయబడును
డిజిటల్ లాండ్స్ సర్వే, లే-అవుట్లు,
నక్ష ప్లానింగ్ చేయబడును,
Auto DCR Online Up Loading, Pre DCR Cad Drawing
భవన నిర్మాణం దరఖాస్తు కొరకు సంప్రదించండి.
GHMC, HMDA, DTCP, TS-bpass - Layout's, Building Permissions
H.No. 11-5-565, Bhagya Laxmi Towers,
Opp: GHMC Circle Office,
Saroornagar, Hyderabad - 500035
Mob : 9393929595



# క్రైమ్ THE మిర్రర్ ®
Voice of Anti Corruption
## తెలంగాణ జిల్లాలు
శనివారం 17-10-2026 | పబ్లిషింగ్ సెంటర్ : హైదరాబాద్





బడంగ్‌పేట్, క్రైమ్ మిర్రర్:

రంగారెడ్డి జిల్లా మున్సిపాలిటీలో భవన నిర్మాణ అనుమతులు, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ (OC) కోసం దరఖాస్తు చేసుకుంటున్న కొందరు బాధితులు అధికారుల తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. బిల్డింగ్ పర్మిషన్లు, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ (రాజ) జారీ ప్రక్రియలో ఏసిపి (ACP), టిఫిఓ (TPO) అధికారుల నుంచి ఇబ్బందులు ఎదురవుతున్నాయని, అనుమతుల కోసం కార్యాలయం చుట్టూ తిరగాల్సి వస్తోందని వారు ఆరోపిస్తున్నారు.




## బడంగ్‌పేట్ మున్సిపాలిటీలో ఏసిపి, టిఫిఓలపై

# వసూళ్ల ఆరోపణలు..!

**బిల్డింగ్ పర్మిషన్లు, ఓసి కోసం వస్తే ఇబ్బందులేనా..?**

**సైట్ ఇన్‌స్పెక్షన్ల పేరుతో బెదిరింపులు.. భారీగా డబ్బులు డిమాండ్ చేస్తున్నారంటూ బాధితుల ఆవేదన!**

### సైట్ ఇన్‌స్పెక్షన్ల పేరుతో ఇబ్బందులా?

ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ (OC) కోసం దరఖాస్తు చేసుకున్న వారి భవనాలను పరిశీలించేందుకు క్షేత్రస్థాయికి వస్తున్న అధికారులు, తనిఖీల సమయంలో ఏవో కారణాలు చూపుతూ అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారని బాధితులు ఆరోపిస్తున్నట్లు తెలుస్తోంది. నిర్మాణానికి సంబంధించిన నిబంధనలు సక్రమంగా ఉన్నాయని చెప్పినా, మరిన్ని అభ్యంతరాలు చెబుతూ ప్రక్రియను ముందుకు సాగనివ్వడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం.

### అనుమతుల కోసం కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలా?

బిల్డింగ్ పర్మిషన్లు, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ (రాజ) కోసం అవసరమైన పత్రాలతో దరఖాస్తు చేసుకున్నప్పటికీ, అనుమతులు పొందడం కష్టంగా మారుతోందని కొందరు బాధితులు వాపోతున్నారు. తమ దరఖాస్తుల్లో ఏవైనా లోపాలు ఉంటే స్పష్టంగా తెలియజేసి, వాటిని సరిచేసుకునే అవకాశం కల్పించాలని కోరుతున్నారు. అయితే, తమ సమస్యలను వివరించేందుకు ప్రయత్నించినప్పుడు నిర్లక్ష్యంగా సమాధానాలు ఎదురవుతున్నాయని వారు ఆరోపిస్తున్నారు.

### అధిక మొత్తంలో డబ్బులు డిమాండ్ చేస్తున్నారనే ఆరోపణలు..

అనుమతుల ప్రక్రియలో వివిధ కారణాలు చూపుతూ అధిక మొత్తంలో డబ్బులు డిమాండ్ చేస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. అయితే, ఈ ఆరోపణలకు సంబంధించి స్వతంత్ర ధృవీకరణ, అధికారిక ఆధారాలు అందుబాటులోకి రావాల్సి ఉంది. ఆరోపణలు నిజమా కాదా అన్నది సంబంధిత అధికారుల స్పందన, సమగ్ర విచారణతోనే స్పష్టమవుతుంది.

### ఉన్నతాధికారులు స్పందించాలి..

భవన నిర్మాణ అనుమతులు, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ (OC) జారీ ప్రక్రియ పారదర్శకంగా సాగాలని బాధితులు కోరుతున్నారు. దరఖాస్తుల స్థితిగతులు, తనిఖీల్లో గుర్తించిన లోపాలు, అనుమతుల జారీలో జాప్యానికి గల కారణాలను స్పష్టంగా తెలియజేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు దృష్టి సారించి, బాధితుల ఆరోపణలపై విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని కోరుతున్నారు.

**గమనిక:** ఈ కథనంలో పేర్కొన్న అంశాలు కొందరు బాధితులు చేసిన ఆరోపణలు, వారు వ్యక్తం చేసిన ఆవేదన ఆధారంగా రూపొందించబడ్డాయి. ఏసిపి (రాజా), టిఫిఓ (రాజా) అధికారులపై వచ్చిన ఆరోపణలు స్వతంత్రంగా ధృవీకరించాల్సి ఉంది. సంబంధిత అధికారుల వివరణ ఈ కథనం ప్రచురణ సమయానికి అందుబాటులో లేదు. వారి స్పందన అందిన పక్షంలో దానికి తగిన ప్రాధాన్యత ఇవ్వబడుతుంది. ఆరోపణలపై సమగ్ర విచారణ జరిగి వాస్తవాలు వెలుగులోకి రావాల్సి ఉంది.

# చేర్యాకర్‌లో ఘనంగా దుర్గా భవాని నవరాత్రి ఉత్సవాలు

## అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసిన తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి



**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి (వెల్దండ):** వెల్దండ మండల పరిధిలోని చేర్యాకర్ గ్రామంలో దుర్గా భవాని నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి శుక్రవారం రోజు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వెల్దండ మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ఎంపీపీ పుట్టరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ అనిల్ కుమార్, జిల్లా నాయకులు నాగులు నాయక్, సర్పంచ్ బచ్చలకూర శ్రీనివాసులు, ఉప సర్పంచ్ కొండలు, మాజీ ఎంపీటీసీలు రాములు, లింగం, మాజీ సర్పంచ్ అంజి నాయక్, మాజీ ఉప సర్పంచులు నిరంజన్, నర్సింహా, శ్రీరాములు పాల్గొన్నారు. అలాగే వార్డు సభ్యులు సునీత, ఆనంద్, అశోక్, లాలయ్య, జంగయ్య, మాజీ వార్డు సభ్యులు మీసాల రాజు, సందీప్, శ్రీనివాస్ రెడ్డి, నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, సుభాష్, పోలె అశోక్, ప్రభాకర్, అంజి మాస్టర్, జహంగీర్, జంగయ్య, నర్సింహా, సతీష్, అనంతరములు, శ్రీను, బుచ్చిబాబు, రవి, కృష్ణ, శ్యాం, మణి, భరత్, శశిధర్, రామచంద్రయ్య, గాండ్ల జంగయ్య, రామరాజు, పరశురాములు, శ్రీకాంత్ రెడ్డి, వంగూర్ లక్ష్మయ్య, వంశీ, శివశంకర్, అభి, శివ, గణేష్, సోను తదితరులు పాల్గొన్నారు.

# జై దుర్గా భవాని నవరాత్రి ఉత్సవాల్లో భక్తుల సందడి

## వెంకటేశ్వర నగర్‌లో సుమారు 1,500 మంది భక్తులతో ఘనంగా ఆధ్యాత్మిక కార్యక్రమాలు



**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** ఖమ్మం నగరంలోని 48వ డివిజన్ పరిధిలో వెంకటేశ్వర నగర్, టీఆర్ఆర్ కాంప్లెక్స్ పక్కన, ఎఫ్‌సీఐ బైపాస్ రోడ్డులో నిర్వహిస్తున్న జై దుర్గా భవాని అమ్మవారి ఐదవ వార్షిక నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. 48వ డివిజన్ బి.ఆర్.ఎస్ నాయకులు, మాజీ కార్పొరేటర్ తోట రామారావు, గోవిందమ్మ దంపతుల ఆధ్వర్యంలో సుమారు 1,500 మంది భక్తులు పాల్గొనగా ఈ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.

తోట రమేష్, డాక్టర్ తోట లక్ష్మణ్ ఆశీస్సులతో ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు అమ్మవారి దర్శనానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ప్రతిరోజూ అమ్మవారికి ప్రత్యేక పూజలు, తీర్థప్రసాదాల పంపిణీతో పాటు మహిళలచే బతుకమ్మ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ ఉత్సవాల్లో భాగంగా భక్తుల ఆధ్యాత్మిక భావాలను పెంపొందించేలా పలు ధార్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, ప్రజలు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని నిర్వాహకులు ఆకాంక్షించారు. ఉత్సవాలను విజయవంతం చేయడంలో సహకరిస్తున్న భక్తులకు, దాతలకు, స్థానిక ప్రజలకు తోట రామారావు, గోవిందమ్మ దంపతులు కృతజ్ఞతలు తెలిపారు. భక్తులందరూ అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని ఉత్సవ కమిటీ సభ్యులు కోరారు.

# విద్యార్థుల భవిష్యత్తుకు విద్యే పునాది

## సరస్వతి దేవి పూజ అనంతరం నోట్‌బుక్స్ పంపిణీ చేసిన సర్పంచ్ జంగమ్మ వెంకటయ్య




**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి (ఆమనగల్లు):** ఆమనగల్లు మండలంలోని శెట్టిపల్లి గ్రామంలో శుక్రవారం సరస్వతి దేవి పూజ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. పూజా కార్యక్రమం అనంతరం సర్పంచ్ జంగమ్మ వెంకటయ్య సమక్షంలో విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి సర్పంచ్ మాట్లాడుతూ.. విద్య ప్రతి ఒక్కరి జీవితంలో ఎంతో కీలకమని, విద్యతోనే మంచి భవిష్యత్తుకు బాటలు వేసుకోవచ్చని సూచించారు. విద్యార్థులు చిన్నప్పటి నుంచే చదువుపై ఆసక్తి పెంచుకుని, క్రమశిక్షణతో చదువుతూ ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలని తెలిపారు. కష్టపడి చదివి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు అవసరమైన విద్యా సామగ్రిని అందించడం ద్వారా వారిలో చదువుపై మరింత ఆసక్తిని పెంపొందించవచ్చని సర్పంచ్ అభిప్రాయపడ్డారు. భవిష్యత్తులోనూ విద్యార్థుల అభ్యున్నతికి, గ్రామ అభివృద్ధికి ఉపయోగపడే ఇలాంటి సేవా కార్యక్రమాలను మరిన్ని నిర్వహించాలని స్థానికులు ఆకాంక్షించారు.



# కస్తాలలో రైతుల ఆగ్రహం... సబ్ స్టేషన్ ముందు నిరసన !

**చండూరు, క్రైమ్ మిర్రర్:** చండూరు మండలం కస్తాల గ్రామంలో రైతులు తిరగబడ్డారు. వ్యవసాయానికి నిరంతరాయంగా 12 గంటల నాణ్యమైన విద్యుత్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ కస్తాల గ్రామంలోని సబ్ స్టేషన్ ముందు నిరసనకు దిగారు. పొలాల్లో పని వదిలేసి పెద్ద సంఖ్యలో రైతులు సబ్ స్టేషన్ ముందు బైఠాయించి తమ ఆవేదనను వినిపించారు. కస్తాల గ్రామంలో రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. పంటలు పండించాలని ఆశతో పొలాల్లోకి దిగిన రైతులు కరెంటు లేక తమ కళ్ళ ముందే పంటలు ఎండిపోతుంటే ఏమీ చేయలేక కన్నీరు పెడుతున్నారు. పంట చేతికి వచ్చే కీలక సమయంలో నీరు అందకపోతే రైతు జీవితమే నాశనం అవుతుంది. పెట్టిన పెట్టుబడి కూడా తిరిగి రాదు. అప్పుల పాలవుతాం. ఈ బాధను అధికారులు అర్థం చేసుకోవాలని రైతులు వేడుకుంటున్నారు. ప్రస్తుతం గ్రామానికి కేవలం 9 గంటలు మాత్రమే కరెంటు ఇస్తున్నారని, ఆ కరెంటు పంటలకు ఏ మాత్రం సరిపోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బోర్లలో మోటార్లు ఉన్నా, కరెంటు లేక పొలాలకు నీరు పెట్టలేకపోతున్నామని వాపోతున్నారు. ఒక పొలానికి నీరు పెడితే మరో పొలానికి నీరు పెట్టేలోపే కరెంటు పోతోందని, దీంతో పంటలకు సరైన సమయంలో నీరు అందడం లేదని చెబుతున్నారు. వరి, పత్తి, కూరగాయ పంటలు నీరు లేక వాడిపోతున్నాయని, ఇదే పరిస్థితి కొనసాగితే పంట చేతికి రాకుండా పోతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రైతులు రోజుకు 12 గంటల కరెంటు ఇవ్వాలని, అది కూడా ఉదయం 5 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు నిరంతరాయంగా, నాణ్యమైన విద్యుత్తు ఇవ్వాలని కోరుతున్నారు. ఉదయం నుండి సాయంత్రం వరకు కరెంటు ఉంటేనే పంటలకు సరిగా నీరు పెట్టగలమని, పంటలను కాపాడుకోగలమని చెబుతున్నారు. మధ్యలో కరెంటు పోకుండా, వోల్టేజ్ తగ్గకుండా నాణ్యమైన విద్యుత్ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. తమ వినతులను అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేసిన రైతులు శుక్రవారం సబ్ స్టేషన్ ముందు నిరసనకు దిగారు. "మాకు 12 గంటల కరెంటు కావాలి", "రైతులను కాపాడండి", "పంటలు ఎండిపోతున్నాయి - అధికారులు స్పందించండి" అంటూ నినాదాలు చేశారు. రైతు బతుకుతేనే ఊరు బతుకుతుంది, రైతు పండిస్తేనే ప్రజలకు తిండి దొరుకుతుంది. కాబట్టి విద్యుత్ శాఖ అధికారులు వెంటనే స్పందించి కస్తాల గ్రామానికి 12 గంటల నాణ్యమైన కరెంటు ఇవ్వాలని రైతులు డిమాండ్ చేశారు. అధికారులు తమ సమస్యను పరిష్కరించే వరకు పోరాటం ఆపబోమని, అవసరమైతే మరింత పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని రైతులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కస్తాల, మెందువారిగూడెం, గోపిడి వారి గూడెం, ఉడతల పల్లి గ్రామాల రైతులు పాల్గొన్నారు.



# ప్రభుత్వ భూమి హెచ్చరిక బోర్డు రాత్రికి రాత్రే మాయం.

**కేశంపేట,(క్రైమ్ మిర్రర్):** ప్రభుత్వ భూముల పరిరక్షణ కోసం రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డును కొందరు గుర్తుతెలియని వ్యక్తులు రాత్రికి రాత్రే మాయం చేసిన ఘటన కేశంపేట మండలంలో తీవ్ర కలకలం రేపింది. కేశంపేట మండలం సంతాపూర్ గ్రామ శివారులోని ప్రభుత్వ భూమిని కాపాడేందుకు అధికారులు పాతిన బోర్డునే తొలగించడం స్థానికంగా పెద్ద చర్చనీయాంశంగా మారింది.గ్రామ శివారులోని సర్వే నంబర్ 131లో ఉన్న ప్రభుత్వ భూమిని ఎవరైనా ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తూ రెవెన్యూ అధికారులు బుధవారం అక్కడ ఒక బోర్డును ఏర్పాటు చేశారు. అయితే, అధికారుల హెచ్చరికలను లెక్కచేయని గుర్తుతెలియని వ్యక్తులు.. బోర్డు పెట్టిన మరుసటి రోజు (గురువారం) రాత్రే దానిని తొలగించి ఎత్తుకెళ్లారు. అంతేకాకుండా, అక్కడ బోర్డు పాతినట్లు ఎలాంటి ఆధారాలు లేకుండా ఉండేందుకు, ఆ గుంతను తిరిగి మట్టితో పూడ్చివేయడం పలు అనుమానాలకు తావిస్తోంది.

# పారిశుద్ధ్య కార్మికుల పాత్ర ఎంతో కీలకం : సర్పంచ్ రమాదేవి

**జిపి కార్మికులకు బట్టలు, రక్షణ పరికరాల పంపిణీ**



**మునుగోడు క్రైమ్ మిర్రర్, అక్టోబర్ 16 :** మునుగోడు గ్రామ పంచాయతీ పరిధిలో నిరంతరం శ్రమిస్తూ గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుతున్న పారిశుధ్య,సఫాయి కార్మికులకు శుక్రవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో దుస్తులు మరియు భద్రతా సామగ్రి మునుగోడు సర్పంచ్ పాలకూరి రమాదేవి నరసింహ గౌడ్ ,సెక్రటరీ రాజశేఖర్ రెడ్డి,ఉప సర్పంచ్ సుగుణమ్మ ,వార్డు సభ్యులతో కలిసి, గ్రామ పంచాయతీ సఫాయి కార్మికులకు స్వయంగా ఈ పరికరాలను అందజేశారు.సర్పంచ్ మాట్లాడుతూ గ్రామాన్ని రోగాల బారిన పడకుండా పరిశుభ్రంగా ఉంచడంలో పారిశుద్ధ్య కార్మికుల పాత్ర ఎంతో కీలకం అన్నారు..

# హైదరాబాద్ బార్లకు భారీ పోటీ..

**ఒక్కో దరఖాస్తుకు 304 మంది పోటీ...**

**క్రైమ్ మిర్రర్ శేరిలింగంపల్లి :** తెలంగాణలో కొత్త బార్ల కేటాయింపు ప్రక్రియలో భాగంగా హైదరాబాద్‌లో ఊహించని రీతిలో దరఖాస్తులు వచ్చాయి. హైదరాబాద్ క్యూర్ పరిధిలోని 14 బార్లకు ఏకంగా 4,251 దరఖాస్తులు దాఖలయ్యాయి, అంటే ఒక్కో బార్‌కు సగటున 304 అప్లికేషన్లు వచ్చాయి. రాష్ట్రవ్యాప్తంగా 41 బార్లకు మొత్తం 8,770 దరఖాస్తులు రాగా, నార్సింగిలో ఎక్సైజ్ కమిషనర్ సి. హరికిరణ్ సమక్షంలో లాటరీ డ్రా తీశారు. జిల్లాల కలెక్టర్ల పర్యవేక్షణలో లాటరీ ప్రక్రియను పూర్తి చేశారు.

# నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొన్న ఈర్ల రాజు ముదిరాజ్

**దుర్గామాతకు ప్రత్యేక పూజలు**

**హిందూ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణ అందరి బాధ్యత**

**అమీన్పూర్, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి అక్టోబర్ 16:** ఝపటాన్‌చెరు నియోజకవర్గం, అమీన్పూర్ మండల పరిధిలో నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా బీరంగూడ డివిజన్ అధ్యక్షుడు ఈర్ల రాజు ముదిరాజ్ వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపాలను సందర్శించి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. సుల్తాన్‌పూర్ గ్రామంలో దుర్గామాతను దర్శించుకుని పూజలు నిర్వహించారు. బీరంగూడ గ్రామంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు ఎడ్ల రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. గండిగూడ, పటేల్‌గూడ గ్రామాలతో పాటు సూర్యోదయ కాలనీ, దుర్గా నగర్ కాలనీలకు చెందిన ఉత్సవ కమిటీ సభ్యులు, స్థానికులు ఈర్ల రాజు ముదిరాజ్‌కు ఆహ్వాన పత్రికలు అందజేసి నవరాత్రి ఉత్సవాలకు ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఈర్ల రాజు ముదిరాజ్ మాట్లాడుతూ.. నవరాత్రి ఉత్సవాలు హిందూ సంస్కృతి, సంప్రదాయాలకు, భక్తిభావానికి, సామాజిక ఐక్యతకు ప్రతీకలని అన్నారు. సనాతన ధర్మం ధర్మబద్ధమైన జీవనం, సేవాభావం, మానవత్వం, పరస్పర గౌరవం వంటి విలువలను బోధిస్తుందని పేర్కొన్నారు. దుర్గామాత ఆరాధన స్త్రీశక్తికి, ధర్మ పరిరక్షణకు ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు.



ఆధ్యాత్మిక కార్యక్రమాల ద్వారా యువతలో సంస్కృతి, సంప్రదాయాల పట్ల గౌరవం పెంపొందుతుందని అన్నారు. అమ్మవారి ఆశీస్సులతో అమీన్పూర్ మండలంలోని ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ప్రజలందరూ ఐకమత్యంతో పండుగలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని కోరారు. అన్నదానం వంటి సేవా కార్యక్రమాలు మానవత్వానికి, సమాజ ఐక్యతకు నిదర్శనమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకుడు కొండా లక్ష్మణ్, అమీన్పూర్ డివిజన్ అధ్యక్షుడు రమేష్ రెడ్డి, మండల నాయకులు శ్రావణ్, జనార్ధన్, రాజమలేష్, గోపి, మనోహర్ చౌదరి, రతన్ చౌదరితో పాటు బీజేపీ కార్యకర్తలు, దుర్గామాత ఉత్సవ కమిటీ సభ్యులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# కలెక్టరేట్‌లో అంగరంగ వైభవంగా బతుకమ్మ సంబురాలు

**ఉద్యోగుల ఆటపాటలతో సందడిగా మారిన ప్రాంగణం**

**గౌరమ్మకు పూజలు నిర్వహించి బతుకమ్మ ఆడిన అదనపు కలెక్టర్ సంగీత**

**సంగారెడ్డి, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి అక్టోబర్ 16:** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ సంబురాలు సంగారెడ్డి కలెక్టరేట్‌లో శుక్రవారం అంగరంగ వైభవంగా జరిగాయి. తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లోని వివిధ శాఖల ఉద్యోగులు నిర్వహించిన ఈ వేడుకలతో ప్రాంగణం పండుగ శోభను సంతరించుకుంది. రంగురంగుల పూలతో పేర్చిన బతుకమ్మలు, సంప్రదాయ ఆటపాటలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ సంగీత గౌరమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించి బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్నారు. బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతిపై ప్రేమకు, పూల విశిష్టతకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. వివిధ శాఖలకు చెందిన మహిళా ఉద్యోగులు అందంగా పేర్చిన బతుకమ్మల చుట్టూ వలయంగా ఏర్పడి సంప్రదాయబద్ధంగా ఆటపాటలతో సందడి చేశారు. తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు ఆలపించిన బతుకమ్మ పాటలు వేడుకలకు మరింత ఉత్సాహాన్ని తీసుకొచ్చాయి. పాటలకు అనుగుణంగా మహిళా ఉద్యోగులు నృత్యాలు చేస్తూ సంబురాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. విధి నిర్వహణలో నిత్యం బిజీగా ఉండే ఉద్యోగులు ఒకచోట చేరి సంప్రదాయ పండుగను సామూహికంగా జరుపుకోవడంతో కలెక్టరేట్‌లో ఆహ్లాదకర వాతావరణం నెలకొంది. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు



అందించడంలో ఇటువంటి వేడుకలు కీలక పాత్ర పోషిస్తాయని పలువురు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారి లలిత కుమారి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ లలితాదేవి, టీజీవో జిల్లా అధ్యక్షుడు డాక్టర్ వైద్యనాథ్, టి.ఎన్.జి.ఓ. జిల్లా అధ్యక్షుడు, మహిళా నాయకులు, సంఘ కార్యవర్గ సభ్యులు, కలెక్టరేట్‌లోని వివిధ శాఖల మహిళా ఉద్యోగులు, సిబ్బంది, తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు, కలెక్టరేట్ సమీప కాలనీల మహిళలు పాల్గొన్నారు.

# రాయదుర్గంలో మున్నూరు కాపు సంఘం పటేల్ భవన్ ప్రారంభం

**- మధ్యతరగతి ప్రజలకు అందుబాటులో ఫంక్షన్ హాల్**

**క్రైమ్ మిర్రర్ శేరిలింగంపల్లి :** తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో రాయదుర్గంలో నూతనంగా నిర్మించిన మున్నూరు కాపు సంఘం పటేల్ భవన్ ప్రారంభోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మధ్యతరగతి ప్రజలకు అందుబాటు ధరల్లో పెళ్లిళ్లు, ఫంక్షన్లు, ఇతర శుభకార్యాలు నిర్వహించుకునేలా అన్ని సౌకర్యాలతో ఈ భవనాన్ని నిర్మించారు. ఖరీదైన ఫంక్షన్ హాళ్లకు ప్రత్యామ్నాయంగా సామాన్య ప్రజలకు ఈ భవనం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని సంఘం సభ్యులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, నాగం స్వామి, నాగం మల్లికార్జున్, రౌతు కనకయ్య, మాధవరం నర్సింగ్ రావు, గాలి అనిల్ కుమార్, శేరిలింగంపల్లి సీనియర్ నాయకుడు,



గచ్చిబౌలి డివిజన్ మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా, సుప్రజ ప్రవీణ్, సంపత్, సల్ల కృష్ణ, రేగుల రాజు, చందు తదితరులు పాల్గొని పూజలు నిర్వహించారు.

# శ్రీరంగాపురం కాలనీలో దసరా ఉత్సవాల్లో పాల్గొన్న యలమంచి ఉదయ్ కిరణ్...

**క్రైమ్ మిర్రర్ మియాపూర్:** శ్రీ దేవి శరన్నవరాత్రి – దసరా ఉత్సవాలను పురస్కరించుకుని మియాపూర్ శ్రీరంగాపురం కాలనీలో కాలనీ ప్రెసిడెంట్ శ్రీ కేశవ్ రావు గారి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కేశవ్ రావు గారి ఆహ్వానం మేరకు యలమంచి ఉదయ్ కిరణ్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు, ఛైర్మన్ యలమంచి ఉదయ్ కిరణ్ గారు ఈ కార్యక్రమంలో పాల్గొని దుర్గాదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి హారతి సమర్పించి, తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఉదయ్ కిరణ్ గారు మాట్లాడుతూ, ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రజల్లో ఐక్యతను, సోదరభావాన్ని పెంపొందిస్తాయని, మన సంస్కృతి సంప్రదాయాలను భావితరాలకు అందిస్తాయని అన్నారు. అమ్మవారి ఆశీస్సులతో అందరి జీవితాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు కలగాలని ఆకాంక్షించారు. అనంతరం ఉత్సవ కమిటీ సభ్యులు ఉదయ్ కిరణ్ గారిని శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మూర్తి, రెడ్డి,



ప్రసాద్, నరసింహ, చరణ్, శరత్, వంశీ, రత్నాచారి, సతీష్, శశి, కమిటీ సభ్యులు, కాలనీ పెద్దలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బ్యాంకుల భద్రతపై పోలీసుల అవగాహన సదస్సు





**బ్యాంకులలో భద్రత చర్యలు చేపట్టాలి**

**బ్యాంకులు, ఏటీఎంల భద్రతలో నిర్లక్ష్యం వహించొద్దు...డీఎస్పీ శ్రీనివాసరెడ్డి**

**సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి... సీఐ చరమంద రాజు**

**క్రైమ్ మిర్రర్,హుజూర్‌నగర్:** బ్యాంకులకు వచ్చే ఖాతాదారుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని, సైబర్ మోసాల నివారణకు అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ శ్రీనివాసరెడ్డి సూచించారు. హుజూర్‌నగర్ పోలీసుల ఆధ్వర్యంలో సీఐ చరమంద రాజు తో కలిసి ఐదు మండలాల బ్యాంకు అధికారులు, సిబ్బందికి అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బ్యాంకులు, ఏటీఎం కేంద్రాల్లో సీసీ కెమెరాలు నిరంతరం పనిచేసేలా చూడాలని, అనుమానాస్పద వ్యక్తుల కదలికలను గమనిస్తూ వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ఓటీపీలు, బ్యాంకు ఖాతా వివరాలను అపరిచితులతో పంచుకోవద్దని ఖాతాదారులకు అవగాహన కల్పించాలన్నారు. బ్యాంకుల్లో తగిన భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని, పోలీసు శాఖతో సమన్వయం చేసుకుంటూ సైబర్ మోసాలు, దొంగతనాల నివారణకు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో హుజూర్‌నగర్, గరిడేపల్లి, నేరేడుచర్ల, మఠంపల్లి, పాలకవీడు మండలాల ఎస్ఐలు, వివిధ బ్యాంకుల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# శేరిలింగంపల్లి బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్న కల్వకుంట్ల కవిత...

**క్రైమ్ మిర్రర్ శేరిలింగంపల్లి :** తెలంగాణ రక్షణ సేన గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు, శేరిలింగంపల్లి నియోజకవర్గం ఇంచార్జీ వాసిలి చంద్రశేఖర్ ప్రసాద్ నేతృత్వంలో శేరిలింగంపల్లి నియోజకవర్గంలో బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన కల్వకుంట్ల కవిత మహిళలతో కలిసి బతుకమ్మ ఆడుతూ సందడి చేశారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచిన ఈ వేడుకల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని ఉత్సాహంగా బతుకమ్మ సంబరాలను జరుపుకున్నారు. వివిధ పోటీల్లో పాల్గొన్న విజేతలకు కల్వకుంట్ల కవిత స్వయంగా బహుమతులు అందజేశారు. మహిళల ఆనందోత్సాహాల మధ్య బతుకమ్మ వేడుకలు వైభవంగా ముగిశాయి.





## ఘనంగా దుర్గామాత నవరాత్రి ఉత్సవాలు

**దోమ (క్రైమ్ మిర్రర్ ) :** దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న దేవి నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో దోమ మండల పరిధి లోని రాకొండా గ్రామంలో ఘనంగా కొనసాగుతున్నాయి. అర్చకులు జోషి గణేష్ తో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి ప్రాంగణంలో ప్రత్యేకంగా కొలాట కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. మహిళలు, భక్తులు ఉత్సాహంగా కొలాటంలో పాల్గొని అమ్మవారిని స్మరించుకున్నారు. పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు ఆలయ నిర్వాహకులు ప్రసాదం పంపిణీ చేశారు. ఈ ఉత్సవాలకు పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి మొక్కలు చెల్లించుకున్నారు ఈ కార్యక్రమంలో చాపల నర్సింలు మహిళా భక్తులు గ్రామస్థులు పాల్గొన్నారు.

## జోష్ కార్యక్రమంలో భాగంగా ఉచిత ఏఐ చెస్ట్ ఎక్సరే స్క్రీనింగ్ క్యాంప్



**మునుగోడు క్రైమ్ మిర్రర్:** జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమం లో బాగంగా టిబి ముక్త్ భారత్ అభియాన్ జోష్ ఆధ్వర్యములో మునుగోడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో కొంపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో ఉచిత మొబైల్ ఏఐ చెస్ట్ ఎక్సరే స్క్రీనింగ్ క్యాంప్ నిర్వహించి,పరీక్షలు నిర్వహించారు.సర్పంచ్ జీడిమెట్ల నిర్మల దశరథ,ఉప సర్పంచ్ వెదిరే విజయేందర్ రెడ్డి పాల్గొని క్యాంప్ ప్రారంభించారు.క్షయ వ్యాధి రహిత సమాజ నిర్మాణంలో భాగస్వామ్యులు కావాలని కోరారు.జ్యోతి,అజయ్, సైదులు, సిబ్బంది పాల్గొన్నారు..

## పీవీ ఎక్స్‌ప్రెస్‌వేపై యాక్సిడెంట్.. ఒకదానికొకటి ఆరు కార్లు ఢీ

హైదరాబాద్‌లోని పీవీ నరసింహారావు ఎక్స్‌ప్రెస్‌వేపై రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. పిల్లర్ నంబర్ 131 సమీపంలో ఆరంఘర్ వైపు వెళ్లే మార్గంలో ఓ కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. దీంతో వెనుక నుంచి వస్తున్న మరో ఐదు కార్లు వరుసగా ఢీకొన్నాయి. ఈ ఘటనతో ఎక్స్‌ప్రెస్‌వేపై కొద్దిసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.పోలీసుల కథనం ప్రకారం.. ఎక్స్‌ప్రెస్‌వేపై వెళ్తున్న ఓ కారు అకస్మాత్తుగా అదుపు తప్పి డివైడర్‌పైకి దూసుకెళ్లింది. అనంతరం అక్కడున్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొని నిలిచిపోయింది. వెనుక నుంచి వేగంగా వస్తున్న వాహనదారులు ముందున్న కారును గమనించి బ్రేకులు వేసేలోపే ఒకదాని వెనుక ఒకటి ఐదు కార్లు ఢీకొన్నాయి. దీంతో మొత్తం ఆరు కార్లు ప్రమాదానికి గురయ్యాయి.



# కొరటికల్ గ్రామ కేవైసీఎస్ నూతన కమిటీ ఎన్నిక

**మునుగోడు క్రైమ్ మిర్రర్ :** నల్గొండ జిల్లా కురుమ యువ చైతన్య సమితి ఆధ్వర్యంలో, నల్గొండ జిల్లా కేవైసీఎస్ అధ్యక్షులు బండారు శంకర్ కురుమ,మునుగోడు మండల కురుమ యువ చైతన్య సమితి అధ్యక్షుడు బొడిషా మల్లేష్. సలహాదారులు మందుల పాండు,మునుగోడు మండల వర్కింగ్ ప్రెసిడెంట్ బండారు మహేష్ కురుమ ప్రధాన కార్యదర్శి బిజిని పరమేష్ కురుమల ఆధ్వర్యంలో కమిటీ ఎన్నుకొన్నారు.గౌరవ అధ్యక్షులు పాలంచి సైదులు కురుమ,గ్రామ అధ్యక్షులు మందుల శేఖర్ కురుమ,వర్కింగ్ ప్రెసిడెంట్ బొడిష మహేందర్ కురుమ,ప్రధాన కార్యదర్శి మాలిగా శివకుమార్ కురుమ,ఉపాధ్యక్షులు మందుల (సుక్క) మహేష్ కురుమ,మాలిగా నరసింహ కురుమ,కోశాధికారి అన్నం శ్రీశైల్ కురుమ,కార్యదర్శి బొడిష సాయి కురుమ,ప్రచార కార్యదర్శి బొడిష మధు కురుమలు నియమితులయ్యారు. ఈ నూతన కమిటీ సభ్యులందరూ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నల్గొండ జిల్లా కమిటీ తరఫున మరియు మునుగోడు మండల కమిటీ తరఫున శుభాకాంక్షలు తెలిపారు.

# శిల్పారామంలో ఆదివాసీ ‘ఆది బజార్’ ట్రైబల్ మేళా..

**ఆకట్టుకుంటున్న గిరిజన ఉత్పత్తులు...**

**క్రైమ్ మిర్రర్ మాదాపూర్:** శిల్పారామంలో నిర్వహిస్తున్న ఆదివాసీ “ఆది బజార్” ట్రైబల్ మేళా సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. గిరిజనులు తీసుకొచ్చిన వివిధ రకాల ఉత్పత్తులు అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ఈ సందర్భంగా



బెంగళూరు నుండి విచ్చేసిన శ్రీమతి చోళమండలం దివ్య గారి శిష్య బృందం వినాయక కౌతం, పురందరదాస కీర్తన, అన్నమాచార్య కీర్తన, కుండపై నృత్యం – మామవతు శ్రీ సరస్వతి, దుర్గా తరంగం అంశాలను ప్రదర్శించి మెప్పించారు. అలాగే శ్రీమతి చేతన రవి గారి శిష్య బృందం కూచిపూడి నృత్య ప్రదర్శనలో గణేశ కృతి, బ్రహ్మాంజలి, అంబ స్తవం, కామాక్షి స్తుతి, ఓంకార రూపిణి నమస్తే శరణ్యే అంశాలను ప్రదర్శించారు. ఈ ప్రదర్శనలో కళాకారులు కిరణ్మయి, కీర్తి, సౌమ్య, ధరణి, యమున, శ్రీ హర్షిత, మృదుల తదితరులు పాల్గొని ప్రేక్షకులను అలరించారు.

# జన నాయకుడి ‘జన్మదిన వేడుకలు’ ఘనంగా..!!

- ం వేలాదిగా తరలివచ్చిన అభిమానులు
- ం కార్యకర్తలు, బీజేపీ నాయకుల సందడి
- ం కోలాహలంగా మారిన కాటారం మండల కేంద్రం
- ం జన హృదయ నేతకు జన్మదిన శుభాకాంక్షల వెల్లువ

**క్రైమ్ మిర్రర్, భూపాలపల్లి ప్రతినిధి:** యశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండల కేంద్రంలో బీజేపీ రాష్ట్ర నాయకులు చల్లా నారాయణరెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయన జన్మదినాన్ని పురస్కరించుకొని అభిమానులు, పార్టీ కార్యకర్తలు, బీజేపీ నాయకులు పెద్ద ఎత్తున తరలివచ్చి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. వేలాదిగా తరలివచ్చిన అభిమానులతో కాటారం మండల కేంద్రంలో పండుగ వాతావరణం నెలకొంది.

**అభిమానుల మధ్య జన్మదిన వేడుకలు**

చల్లా నారాయణరెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని ఆయన అభిమానులు, అనుచరులు ప్రత్యేక ఉత్సాహాన్ని ప్రదర్శించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన అభిమానులు, కార్యకర్తలు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ వేడుకల్లో పాల్గొన్నారు. బీజేపీ నాయకులు, కార్యకర్తల సందడితో జన్మదిన వేడుకలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

**కార్యకర్తలు, నాయకుల సందడి..**

జన్మదిన వేడుకల్లో బీజేపీ నాయకులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ అభిమానాన్ని



చాటుకున్నారు. చల్లా నారాయణరెడ్డికి శుభాకాంక్షలు తెలిపేందుకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారితో వేడుకల ప్రాంగణం సందడిగా మారింది. అభిమానులు, కార్యకర్తల ఉత్సాహం వేడుకలకు ప్రత్యేక శోభను తీసుకొచ్చింది.

**కాటారంలో పండుగ వాతావరణం**

చల్లా నారాయణరెడ్డి జన్మదిన వేడుకల నేపథ్యంలో కాటారం మండల కేంద్రంలో సందడి నెలకొంది. అభిమానులు, బీజేపీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొనడంతో వేడుకలు కోలాహలంగా సాగాయి. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల సమక్షంలో జన్మదిన వేడుకలు ప్రత్యేకతను సంతరించుకున్నాయి. కాటారం మండల కేంద్రంలో జరిగిన ఈ జన్మదిన వేడుకలు బీజేపీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపాయి. అభిమానులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో చల్లా నారాయణరెడ్డి జన్మదిన వేడుకలు సందడిగా

# క్రిష్ణగిరి పాదాలగుట్ట శ్రీ రాధాకృష్ణ ఆలయ క్షేత్రంలో చండీ హోమం

**ప్రకృతి వనరుల పరిరక్షణతోనే పర్యావరణ సమతుల్యత: ఆర్. నరేష్ కుమార్**

**క్రైమ్ మిర్రర్, శంకర్‌పల్లి:** ప్రకృతి వనరులను పరిరక్షిస్తూ పర్యావరణ సమతుల్యతను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలంగాణ భాజపా ఎండోమెంట్ సెల్ ధార్మిక సంస్థ రంగారెడ్డి జిల్లా రూరల్ జాయింట్ కన్వీనర్, శంకర్‌పల్లి సేవా ఫౌండేషన్ అధ్యక్షుడు ఆర్. నరేష్ కుమార్ అన్నారు. ఎలినీనో ప్రభావం తగ్గి దేశవ్యాప్తంగా సమృద్ధిగా వర్షాలు కురవాలని, రైతులు, ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ చండీ హోమం నిర్వహించినట్లు తెలిపారు. సేవా సంకల్ప్ అభియాన్‌లో భాగంగా, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజా జీవితాన్ని పురస్కరించుకుని శుక్రవారం శంకర్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని గుబ్బడి పత్తాపూర్‌లో ఉన్న క్రిష్ణగిరి పాదాలగుట్ట శ్రీ రాధాకృష్ణ ఆలయ క్షేత్రంలో భాజపా ఎండోమెంట్ సెల్ ధార్మిక సంస్థ, శంకర్‌పల్లి సేవా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో చండీ హోమం నిర్వహించారు. వేద పండితులు కేదార్‌నాథ్ చారి వేదమంత్రోచ్చారణల నడుమ హోమ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నరేష్ కుమార్ మాట్లాడుతూ విజయదశమి నుంచి ప్రజలు, రైతులు, నిరుపేదలు ఎలాంటి కష్టనష్టాలకు గురికాకుండా సుఖంగా ఉండాలనే సంకల్పంతో పవిత్రమైన దేవీ నవరాత్రుల సమయంలో చండీ హోమం నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ప్రకృతి వనరులను స్వార్థ ప్రయోజనాల కోసం దుర్వినియోగం చేయకుండా, ప్రకృతిని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం అనేక రంగాల్లో అభివృద్ధి సాధిస్తోందని నరేష్ కుమార్ పేర్కొన్నారు. రామమందిర నిర్మాణం ద్వారా భారతీయ సనాతన ధర్మ సంప్రదాయాలకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు లభించిందన్నారు. దేశంలో ధర్మం, న్యాయం, నీతి విలువలు మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. కరోనా సమయంలో



భారత ప్రజలను రక్షించడంతో పాటు ఇతర దేశాలకు సైతం సహాయం అందించిన విషయాన్ని గుర్తుచేశారు.
యువతలో దేశభక్తి, సేవాభావం, ధైర్యసాహసాలు పెంపొందాలని, ఛత్రపతి శివాజీ, స్వామి వివేకానంద, రుద్రమదేవి, ఝాన్సీ లక్ష్మీబాయి, జిజాబాయి వంటి మహనీయుల స్ఫూర్తితో యువత ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

**గోరక్షణతోనే గ్రామీణ జీవనానికి బలం**

గోమాతను భారతీయ సంప్రదాయంలో ఆరాధ్య దైవంగా భావిస్తారని, గోవుల సంరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నరేష్ కుమార్ అన్నారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో పశుసంపదకు ప్రత్యేక స్థానం ఉందని, గోరక్షణతో పాటు ప్రకృతి వనరుల పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.

**పలువురు ప్రముఖుల హాజరు**

ఈ కార్యక్రమంలో భాజపా ఎండోమెంట్ సెల్ ధార్మిక సంస్థ చేవెళ్ల అసెంబ్లీ కన్వీనర్ సి. జయరాం రెడ్డి, శంకర్‌పల్లి మండల కన్వీనర్ పద్మాకర్ చార్యులు, శంకర్‌పల్లి మున్సిపల్ కన్వీనర్ వివేంద్ర చారి, నవాబుపేట మండల కన్వీనర్ చంద్రశేఖర్ రెడ్డి, సుఖముల కో-కన్వీనర్ కేదారి చారి, సేవా ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు కార్తీక్, గ్రామ పెద్దలు ఆర్. రామలక్ష్మయ్య, మాజీ సర్పంచ్ రామచంద్రయ్య, జంగయ్య ముదిరాజ్, భూపతి రెడ్డి, ఆర్. రాజు, రాములు గౌడ్, చరణ్ గౌడ్, హరికృష్ణ, ఆర్. నీల, జంగయ్య, శ్రీశైలం గౌడ్, వెంకటేష్ గౌడ్, శ్రీనివాస్ బైండ్ల, జగదీష్‌తో పాటు విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# రైతులకు ఎకరాకు 40 వేల ఆర్థిక సాయం అందించాలి

**--బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఏరుకొండ అబ్బయ్య**



**మర్రిగూడ(క్రైమ్ మిర్రర్):** తెలంగాణలో ఎల్‌నినో ప్రభావంతో రైతులు పంటలు వేయవద్దంటూ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన ప్రకటనపై, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఏరుకొండ అబ్బయ్య స్పందించారు. రైతులు పంటలు సాగు చేయకపోతే వారి కుటుంబాలు జీవనం ఎలా సాగిస్తాయని ప్రశ్నించారు. రైతులు దేశానికి వెన్నెముక అని, వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్న రైతులు, సాగు చేయలేని పరిస్థితులు ఏర్పడితే వారి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటాయని పేర్కొన్నారు. ప్రభుత్వం రైతుల కష్టాలను గుర్తించి తక్షణమే, ఆర్థికంగా ఆదుకోవాలని అబ్బయ్య డిమాండ్ చేశారు. ప్రతి రైతుకు ఎకరానికి 40 వేల చొప్పున ఆర్థిక సహాయం అందించాలని, రైతుబంధు తరహాలో నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేయాలని ఆయన కోరారు. రైతుల జీవనోపాధిని కాపాడి, వారి కుటుంబాలకు భరోసా కల్పించే బాధ్యత ప్రభుత్వంపై ఉందని ఆయన పేర్కొన్నారు.

## కాంగ్రెస్ బలోపేతానికి రాజగోపాల్‌రెడ్డి కృషి అభినందనీయం!

**ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్న నాయకుడు**

**క్రైమ్ మిర్రర్,యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో:** మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని చౌటుప్పల్ మున్సిపాలిటీ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి ఎర్రగోని లింగస్వామి యాదవ్ కొనియాడారు. కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి రాజగోపాల్‌రెడ్డి చేస్తున్న కృషి అభినందనీయమని పేర్కొన్నారు. చౌటుప్పల్ ప్రాంత అభివృద్ధికి, ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ఎమ్మెల్యే సహకారం ఎంతో అవసరమని అన్నారు. ప్రజల సమస్యలను ఉన్నతాధికారులు, ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేసే నాయకత్వం ప్రజలకు అండగా నిలుస్తుందని తెలిపారు. పార్టీ కార్యకర్తలకు ప్రోత్సాహం అందిస్తూ, వారికి తగిన గుర్తింపు కల్పించడం పార్టీ బలోపేతానికి దోహదపడుతుందని పేర్కొన్నారు. చౌటుప్పల్ మున్సిపాలిటీ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శిగా తనకు అవకాశం కల్పించిన పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి నిబద్ధతతో పనిచేస్తానని లింగస్వామి యాదవ్ స్పష్టం చేశారు.కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలందరినీ సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతానని తెలిపారు.



# చండూరు మార్కండేయ ఆలయంలో సరస్వతి రూపంలో దర్శనమిచ్చిన అమ్మవారు

**ఇక్కత్ పట్టుచీరను అమ్మవారికి సమర్పించిన మాస్టర్ వీవర్ పగిడిమర్రి శ్రీనివాసులు -జయలక్ష్మి దంపతులు**

**ఘనంగా కుంకుమార్చన అనంతరం అన్నదానం**









**చండూరు,క్రైమ్ మిర్రర్ :** చండూరులోని మర్కండేయ ఆలయంలో కొనసాగుతున్న శ్రీ రాజరాజేశ్వరి మాత శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారము, ఆరవరోజు మహా సరస్వతీ దేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. పూజా కర్తలు: బిక్షమయ్య-శోభ దంపతులు. అమ్మవారికి ఇక్కత్ పట్టు చీరెను మాస్టర్ వీవర్ పగిడిమర్రి శ్రీనివాసులు- జయలక్ష్మి దంపతులు సమర్పించారు.ఉదయం కుంకుమార్చన నిర్వహించి అనంతరం మధ్యాహ్నం ఘనంగా అన్నదానం నిర్వహించారు. అన్నదాన వితరణకు సహకరిస్తున్నవారు చెరుపల్లి భిక్షమయ్య-శోభ, వారి కుమార్తె డా. హరిణి. కంకణదారులకు అన్నప్రసాద దాత కర్నాటి విద్యాసాగర్-కరుణశ్రీ దంపతులు. నిత్య పులిహోర దాత జూలూరు కృష్ణయ్య-పద్మ దంతపులు. ఇక్కత్ చీరల దాతలు గంజి యాదగిరి-యశోద,జూలూరు ఆంజనేయులు-పద్మ, జూలూరు శ్రీనివాసులు-సునీత, చిలుకూరి శ్రీనివాసులు-రాధిక, పగిడిమర్రి శ్రీనివాసులు-జయలక్ష్మి, చిలుకూరి నర్సింహ్మా-లక్ష్మమ్మ, చెరపల్లి అంజయ్య-యాదమ్మ, కలిమికొండ మ షేష్-గిరిజ, పద్మావతి హాండ్లూమ్స్(యేశాల హరీష్.నవరాత్రిలలో నిత్యపూల దండల దాతలు గుర్రం భిక్షమయ్య, కోమటి వీరేశం, అర్చక దాత పాల్వాయి స్రవంతిరెడ్డి,హోమ సామగ్రి దాత కోడి వెంకటేశం-కళమ్మ, పూజా సామాగ్రి దాత జూలూరు శేఖర్-వరలక్ష్మి, అమ్మవారికి నిత్య లడ్డూల దాతలు ఏలె శ్రీనివాసులు, కోడి శివశంకర్‌వస్తురూపేణ దాతలు కటకం రమేష్, ఏలె శ్రీనివాసులు, జూలూరు వెంకటే0శం, పూజా కార్యక్రమంలో పాల్గొను భక్తులు ఉత్సవ కమిటీ వద్ద పేరు నమోదు చేసుకోవాలని ఆలయ ఛైర్మన్ రావిరాల నగేష్ తెలిపారు. అలాగే అమ్మవారి చీరల వేలం పాటలో ఆసక్తి గల భక్తులు తమ పేరును ఫోన్ నెం. 9985041123, 8885440002, 9885751117, 8142246328లకు సంప్రదించాలని తెలిపారు. అన్నదాన కార్యక్రమంలో ట్రస్ట్ ఛైర్మన్ కోమటి వీరేశం, ఆలయ ఛైర్మన్ రావిరాల నగేష్, పద్మశాలీ సంఘం గౌరవ అధ్యక్షుడు పులిపాటి ప్రసన్న, గౌరవ సలహాదారు కోడి గిరిబాబు, అధ్యక్షకార్యదర్శులు గుర్రం భిక్షమయ్య, గంజి శ్రీను, కౌన్సిలర్ కోడి సుష్మవెంకన్న, మాస్టర్ వీవర్ గంజి యాదగిరి, కార్మిక సంఘం అధ్యక్షుడు రాపోలు వెంకటేశం, యువజన సంఘం సభ్యులు, చేనేత కార్మిక సంఘం, పరిరక్షణ సేవా సమితి(సీపీఎస్) సభ్యులు,భజన మండలి, ఉభయదేవాలయాల

# ఎల్ నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు.. నీటిని, విద్యుత్తును పొదుపుగా వాడాలి

**క్రైమ్ మిర్రర్ శంకర్ పల్లి :** రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ప్రతి ఒక్కరూ నీటిని, విద్యుత్తును పొదుపుగా వినియోగించాలని ఏపీఓ నాగభూషణం గ్రామస్తులు, రైతులకు పిలుపునిచ్చారు. భూగర్భ జలాలను పెంపొందించేందుకు ప్రతి ఇంట్లో ఇంకుడు గుంత నిర్మించుకోవడంతో పాటు ప్రతి బోరుబావి వద్ద రీఛార్జ్ నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. శుక్రవారం శంకర్‌పల్లి మండలం కొత్తపల్లి గ్రామంలో సర్పంచ్ బలవంత్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ప్రత్యేక గ్రామసభలో ఏపీఓ నాగభూషణం ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.

### భూగర్భ జలాల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలి

ఎల్ నినో ప్రభావంతో వర్షాలు తక్కువగా కురిసే పరిస్థితులు ఏర్పడితే భూగర్భ జలాలపై తీవ్ర ప్రభావం పడుతుందని నాగభూషణం పేర్కొన్నారు. ఇప్పటి నుంచే నీటి సంరక్షణ చర్యలు చేపట్టకపోతే రాబోయే వేసవిలో తాగునీరు, సాగునీటి అవసరాలు తీర్చుకోవడంలో ఇబ్బందులు ఎదురయ్యే ప్రమాదం ఉందన్నారు.

ప్రతి ఇంటికి ఇంకుడు గుంత (సోక్ పిట్) నిర్మించుకోవాలని సూచించారు. వర్షపు నీరు వృథాగా ప్రవహించకుండా భూమిలోకి ఇంకేలా చేయడం ద్వారా భూగర్భ జలాలను పెంపొందించవచ్చని వివరించారు. గ్రామంలోని ప్రతి వార్డులో నీటి సంరక్షణ చర్యలను విస్తృతంగా చేపట్టాలని పిలుపునిచ్చారు.

### రైతులకు రూ.30 వేల వరకు ఆర్థిక సహాయం

రైతులు తమ బోరుబావుల వద్ద బోర్‌వెల్ రీఛార్జ్ నిర్మాణాలు ఏర్పాటు చేసుకోవాలని నాగభూషణం సూచించారు. ఉపాధి హామీ పథకం కింద అర్హత, నిబంధనలకు అనుగుణంగా రూ.30 వేల వరకు ఆర్థిక సహాయం అందించే అవకాశం ఉందని తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అదేవిధంగా పొలాల్లో ఫామ్ పాండ్స్ (వ్యవసాయ క్షేత్రాల్లో నీటి నిల్వ కుంటలు) నిర్మించుకోవడం ద్వారా వర్షపు నీటిని నిల్వ చేసుకుని వ్యవసాయ అవసరాలకు వినియోగించుకోవచ్చని వివరించారు.

### విద్యుత్తును వృథా చేయొద్దు

నీటితో పాటు విద్యుత్తును కూడా పొదుపుగా వినియోగించాలని ఏపీఓ సూచించారు. అవసరం లేనప్పుడు విద్యుత్ మోటార్లను నడపడం, లైట్లు వెలిగించడం మానుకోవాలని కోరారు. నీటి సంరక్షణను ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా భావించి ఆచరణలో పెట్టాలని పిలుపునిచ్చారు.

### గ్రామాన్ని వర్షాభావం నుంచి కాపాడేందుకు కృషి

ఈ సందర్భంగా సర్పంచ్ బలవంత్ రెడ్డి మాట్లాడుతూ కొత్తపల్లి గ్రామంలో నీటి సంరక్షణకు గ్రామపంచాయతీ తరఫున అవసరమైన చర్యలు చేపడతామని తెలిపారు. ప్రతి వార్డులో ఇంకుడు గుంతల నిర్మాణాన్ని ప్రోత్సహించి, వర్షపు నీటిని సంరక్షించేలా గ్రామస్తులకు అవగాహన కల్పిస్తామని హామీ ఇచ్చారు. గ్రామంలోని రైతులు, ప్రజలు నీటి పొదుపునకు ప్రాధాన్యతనిస్తూ గ్రామాభివృద్ధికి సహకరించాలని కోరారు.





# లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేసిన సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి లింగస్వామి, పాలకవర్గం

**క్రైమ్ మిర్రర్,సంస్థాన్ నారాయణపురం:** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో గ్రామపంచాయతీ కార్యాలయంలో లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేసిన సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి లింగస్వామి, పాలకవర్గం ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పేద ప్రజలు ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందేందుకు రేషన్ కార్డు ఎంతో కీలకమని పేర్కొన్నారు. ప్రజా పాలనలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం అనేక పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తోందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల ఫలాలు అందించేందుకు కృషి చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మంత్రులకు, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పల్లె మల్లారెడ్డి, పంచాయతీ కార్యదర్శి నవీన్ కుమార్, మాజీ సర్పంచ్ కొండ్రెడ్డి నరసింహ,జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు మందుగుల బాలకృష్ణ, వార్డు సభ్యులు పందుల యాదగిరి గౌడ్, సింగం బిక్షపతి, సూర పెల్లి వెంకటేష్, కట్ల వనజ భాస్కరాచారి, పట్నం బాలకృష్ణ గౌడ్, సభావత్ రఘు నాయక్, నీళ్ల అనిత శంకర్, చింతల శైలజ సత్యనారాయణ, సింగపంగ ప్రశాంతి రమేష్, మహమ్మద్ అలీమా యూసఫ్ ఖాన్, చేనేత సహకార సంఘం అధ్యక్షులు చిలుకూరు శీను, కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి చిలువేరు శంకర్, టిఆర్ఎస్ నాయకులు వడ్డేపల్లి రాములు సాగర్, చేనేత సహకార సంఘం డైరెక్టర్ దువ్వ విజయలక్ష్మి, కాంగ్రెస్ పార్టీ నాయకులు రాచకొండ లింగస్వామి, గ్రామ ప్రజలు లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేసిన సర్పంచ్ వసంత బాలు నాయక్

**క్రైమ్ మిర్రర్,సంస్థాన్ నారాయణపురం:** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల వెంకం భావి తండా గ్రామపంచాయతీ కార్యాలయంలో లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేసిన సర్పంచ్ వసంత బాలు నాయక్ ., ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పేద ప్రజలు ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందేందుకు రేషన్ కార్డు ఎంతో కీలకమని పేర్కొన్నారు. ప్రజా పాలనలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం అనేక పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తోందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల ఫలాలు అందించేందుకు కృషి చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి మంత్రులకు, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వెంకం భావి తండా గ్రామ ప్రజలు లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.




# సర్పంచుల బిల్లులు చెల్లించాలంటే ఎంపీడీవో కార్యాలయంలో చేతులు తడపాల్సిందే.. ?

**చండూరు,క్రైమ్ మిర్రర్:** చండూరు ఎంపీడీవో కార్యాలయం లంచాలకు పరాకాష్ఠగా మారిందనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి. అసలే గ్రమా పంచాయితీలకు వచ్చే నిధులు సక్రమంగా రాక సమస్యలతో కూనరిల్లుతున్నాయి. అయితే ప్రస్తుతం 15 వ ఆర్థక సంఘం నిధులు గ్రమ పంచాయితీలకు ఊపిరి పోశాయి. ఈ విషయం ఇలా ఉంటే. సర్పంచులు గ్రమ పంచాయితీల్లో పనులు చేయించాక. ఎంబీ చేయించి ఎంపీడీవో కార్యాలయంకు వస్తారు. ఆతర్వాత కార్యలయంలో ఉండే ఉద్యోగులు వాటిని సిస్టమ్‌లో అప్‌లోడ్ చేసి చెక్కులు పాస్ చేయటానికి కావల్సిన పనిని పూర్తి చేస్తారు. ఇక్కడే సదరు ఉద్యోగులకు చేతులు తడపాల్సి వస్తుంది అనే ఆరోపణలు సర్పంచుల నుంచి వెలువడుతున్నాయి. ఏ సర్పంచి అయినా సరే బిల్లులు రావాలంటే ఎంపీడీవో కార్యాలయంలో ఓ ఉద్యోగి చేతులు తడపాల్సిందే....? ఇటీవల ఓ గ్రామ సర్పంచి తన బిల్లులు పాస్ చేసినందుకు ఎంతో కొంత తనకు తోచినంత ఎమౌంట్‌ను సదరు ఉద్యోగికి సమర్పించగా....ఇంతేనా నాకు ఇచ్చేది అంటు ఆ ఎమౌంట్‌ను వాపస్ చేసి ఆ సర్పంచికి బిల్లులు ఇవ్వకుండా ముప్పు తిప్పలు పెడుతున్నాడు. సదరు సర్పంచి ఈ విషయమై ఉన్నత ఉద్యోగులకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధం అయ్యారు. ఈయనతో పాటు మరికొంత మంది సర్పంచులు సైతం ఫిర్యాదు చేసేందుకు సిద్ధం అవుతున్నారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. అసలు ఈ వసూళ్ల భాగోతంలో ఒక్క ఉద్యోగి మాత్రమే ఉండరని ఇందులో




కార్యాలయంలో ఉండే ఇతర ఉద్యోగులు కూడా భాగస్వామ్యంగా ఉంటారనే ఆరోపణలు సైతం ఉన్నాయి. ఈ విషయమై ఉన్నత అధికారులు ఇప్పటికైన దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైన ఉంది. ఈ విషయమై ఎంపీడీవో యాదగిరిని వివరణ కోరగా టెక్నికల్ సమస్యలు ఉన్నవారికి బిల్లులు రావటంలో కొంత ఆలస్య అవుతుందని కాని తన కార్యాలయంలో బిల్లులు చెల్లించాలంటే డబ్బులు అడుగుతున్నారనే ఫిర్యాదులు రాలేదని ఇకపై ఈ విషయంపై దృష్టిసారిస్తానని తెలిపారు.

# గుండాల మండల కేంద్రంలో ఘనంగా సద్దుల బతుకమ్మ ఉత్సవాలు

**పూల సంబరంతో పులకించిన పల్లె.. ఆటపాటలతో మార్మోగిన బతుకమ్మ బండ!**

**క్రైమ్ మిర్రర్, యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో:** తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ.. గుండాల మండల కేంద్రంలో ప్రత్యేక సంప్రదాయంతో అంగరంగ వైభవంగా జరిగింది. సాధారణంగా తొమ్మిదో రోజు సద్దుల బతుకమ్మ నిర్వహించడం ఆనవాయితీ కాగా.. గుండాలలో మాత్రం ఏడో రోజే సద్దుల బతుకమ్మను జరుపుకోవడం తరతరాలుగా కొనసాగుతున్న ప్రత్యేక ఆచారం. ఈ సంప్రదాయానికి అనుగుణంగా శుక్రవారం మండల కేంద్రంలో సద్దుల బతుకమ్మ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు.

**"విద్యుత్ దీపాల వెలుగుల్లో బతుకమ్మ బండ.. రంగురంగుల పూలతో కనువిందు"!**

గ్రామ సమీపంలోని బతుకమ్మ బండపై ఉత్సవాల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వివిధ కుల సంఘాలకు చెందిన దేవాలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించడంతో ఆ ప్రాంతమంతా పండుగ శోభను సంతరించుకుంది. రంగురంగుల పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలతో ఆడపడుచులు ఉత్సవ ప్రాంగణానికి చేరుకుని సందడి చేశారు. వేద పండితులు శ్రీనివాస్ శర్మ గౌరమ్మ పూజ నిర్వహించి ఉత్సవాలను ప్రారంభించారు. అనంతరం మహిళలు భక్తిశ్రద్ధలతో బతుకమ్మల చుట్టూ తిరుగుతూ సంప్రదాయ పాటలు పాడుతూ ఆటపాటలతో సందడి చేశారు. పూల పరిమళాలు.. మహిళల కోలాటాలు.. బతుకమ్మ పాటలతో బతుకమ్మ బండ పండుగ కళను సంతరించుకుంది.





**"రామసముద్రం చెరువులో గంగమ్మ ఒడికి బతుకమ్మలు"!**

సంప్రదాయబద్ధంగా బతుకమ్మ ఆటలు ముగిసిన అనంతరం మహిళలు గ్రామ సమీపంలోని రామసముద్రం చెరువుకు చేరుకున్నారు. అక్కడ గంగమ్మ ఒడిలో బతుకమ్మలను నిమజ్జనం చేసి గౌరమ్మకు భక్తిపూర్వకంగా వీడ్కోలు పలికారు. ఏడో రోజే సద్దుల బతుకమ్మ నిర్వహించుకోవడం గుండాల ప్రత్యేకతగా నిలవగా.. ఈ ఆచారం స్థానిక మహిళల్లో విశేషమైన అనుబంధాన్ని చాటిచెప్పింది.

**"నాయకుల సందడి.. ఫ్లెక్సీలు, డీజేలతో పండుగ కోలాహలం"!**

బతుకమ్మ ఉత్సవాల సందర్భంగా జిల్లా, మండల స్థాయి నాయకులు మహిళలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. వివిధ కుల సంఘాలు, రాజకీయ పార్టీల నాయకులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, డీజే సౌండ్‌తో ఉత్సవ ప్రాంగణం సందడిగా మారింది. తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి, పూల పండుగ వైభవానికి ప్రతీకగా నిలిచిన సద్దుల బతుకమ్మ వేడుకలు గుండాల మండల కేంద్రంలో పండుగ వాతావరణాన్ని నింపాయి.



# పోచమ్మ తల్లి ఉత్సవాలను విజయవంతం చేసిన ప్రతి భక్తుడికి కృతజ్ఞతలు




**అమీన్పూర్, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి అక్టోబర్ 16** దేవి శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని బీరంగూడలోని శ్రీశ్రీశ్రీ పోచమ్మ తల్లి దేవాలయంలో నిర్వహించిన చండీ హోమం, సాంస్కృతిక కార్యక్రమాలు, మహా అన్న సమారాధనను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు ఎడ్ల రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అమ్మవారి ఉత్సవాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని, భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి కార్యక్రమాలను విజయవంతం చేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారి ఆశీస్సులు పొందేందుకు విచ్చేసిన భక్తులందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. చండీ హోమం, సాంస్కృతిక కార్యక్రమాలు, మహా అన్న సమారాధన నిర్వహణలో సహకరించిన పెద్దలు, మహిళలు, యువకులు, స్నేహితులు, శ్రేయోభిలాషులు, సేవాభావంతో పనిచేసిన ప్రతి ఒక్కరి సహకారం మరువలేనిదని పేర్కొన్నారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రజల్లో భక్తిభావాన్ని పెంపొందించడంతో పాటు ఐక్యత, సోదరభావాన్ని చాటిచెబుతాయని అన్నారు. భక్తులందరి సహకారంతోనే ఉత్సవాలు విజయవంతమయ్యాయని, ప్రతి ఒక్కరూ చూపిన ఆదరణకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు చెప్పారు. శ్రీశ్రీశ్రీ పోచమ్మ తల్లి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని అమ్మవారిని ప్రార్థిస్తున్నట్లు ఎడ్ల రమేష్ తెలిపారు. భవిష్యత్తులోనూ అమ్మవారి సేవా కార్యక్రమాలకు తమ వంతు సహకారం అందిస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎడ్ల రమేష్, సంధ్య దంపతులు మరియు వారి కుటుంబ సభ్యులు ఉత్సవాల్లో పాల్గొన్న భక్తులందరికీ మరోసారి కృతజ్ఞతలు తెలియజేశారు.

# సీఎం పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి



**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి:** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ నెల 20న నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గ పరిధిలోని వంగూరు మండలం, ముఖ్యమంత్రి స్వగ్రామమైన కొండారెడ్డిపల్లిలో నిర్వహించనున్న దసరా ఉత్సవాల్లో పాల్గొననున్న నేపథ్యంలో పర్యటన ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని వనపర్తి జిల్లా కలెక్టర్, నాగర్ కర్నూల్ జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటనలో ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా అన్ని జిల్లా శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లపై శుక్రవారం సాయంత్రం కొండారెడ్డిపల్లి గ్రామాన్ని సందర్శించి ఏటీసీ కేంద్ర నిర్మాణ స్థలం, భూగర్భ మరుగునీటి శుద్ధి కేంద్రాన్ని నూతనంగా ప్రారంభించనున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఆదర్శ్ సురభి, అచ్చంపేట సబ్ కలెక్టర్ సలోని చాబ్రా, అదనపు కలెక్టర్లు బి. చెన్నయ్య, దేవసహాయంతో కలిసి వివిధ శాఖల జిల్లా అధికారులతో ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటనకు సంబంధించి ఆయా శాఖలు చేపట్టాల్సిన పనులు, నిర్వర్తించాల్సిన బాధ్యతలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ... ముఖ్యమంత్రి పర్యటనకు అవసరమైన ఏర్పాట్లన్నింటినీ ముందస్తు ప్రణాళికతో నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలని సూచించారు. భద్రతా ఏర్పాట్లు, పర్యటన ప్రాంగణం సిద్ధం చేయడం, పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా, రవాణా సదుపాయాల కల్పనపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. గ్రామ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సౌకర్యాలు కల్పించాలని సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. ప్రతి శాఖకు కేటాయించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని, పనుల్లో జాప్యం జరగకుండా నిర్దేశిత గడువులోగా ఏర్పాట్లను పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, ఏర్పాట్లలో ఏవైనా సమస్యలు ఎదురైతే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించాలని సూచించారు. శాఖల మధ్య సమన్వయంతో పనిచేస్తూ పర్యటనను సజావుగా నిర్వహించేందుకు అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా పోలీసు అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని డిఎస్పిని కలెక్టర్ ఆదేశించారు.

## హర్రర్ థ్రిల్లర్ మిస్టరీతో పోతిరెడ్డిపల్లి మూవీ

### 2027 ఏప్రిల్ లో ప్రేక్షకుల ముందుకు మూవీ : స్వామి కుమార్



**బాలాపూర్ (క్రైమ్ మిర్రర్) :** విలేజ్ మిస్టరీతో ఆరాధ్య క్రియేషన్ పతాకంపై అశోక్ కుమార్ రొయ్య దైరెక్షన్లో 2027 ఏప్రిల్ లోపు ప్రేక్షకుల ముందుకు గ్రామీణ మిస్టరీతో హర్రర్ థ్రిల్లర్ తో కూడిన పోతిరెడ్డిపల్లి మూవీ వస్తున్నదని త్రికన ప్రొడక్షన్, త్రిపుర మీడియా, ప్రొడ్యూసర్ ఓర్స్ స్వామి కుమార్ తెలిపారు. పోతిరెడ్డిపల్లి చిత్ర పూజా కార్యక్రమాలు వైభవంగా నిర్వహించి ముహూర్తపు సన్నివేశాలు తీయడం జరిగిందని ఈ కార్యక్రమానికి సినీ సీనియర్ పెద్దలు హాజరు కావడం జరిగిందని ఈ చిత్రం గ్రామీణ నేపథ్యంలో ఉత్కంఠ భరిత మలుపులతో ఈ రూపొందుతోందని, సిని చిత్ర పరిశ్రమలో హర్రర్ మిస్టరీ థ్రిల్లర్ కథాంశాలకు ఎప్పుడు ఒక ప్రత్యేకమైన స్థానం ఉంటుందని అందులోనే భాగంగానే ఈ చిత్రం నిర్మాణం కొనసాగుతుందని ప్రొడ్యూసర్ ఓర్స్ స్వామి కుమార్ తెలిపారు.

## మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామిని కలిసిన సాయమోళ్ల నర్సింగ్ రాజ్



**హత్నూర, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి అక్టోబర్ 16:** తెలంగాణ రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామిని అఖిల భారత సమతా సైనిక్ దళ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, దళిత రత్న సాయమోళ్ల నర్సింగ్ రాజ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రితో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. దళితుల సంక్షేమం, సామాజిక న్యాయం, అణగారిన వర్గాల అభ్యున్నతికి సంబంధించిన అంశాలపై చర్చించినట్లు సమాచారం. సమాజంలో సమానత్వం, సోదరభావం పెంపొందించడంతో పాటు బడుగు, బలహీన వర్గాల హక్కుల పరిరక్షణకు కృషి చేయాల్సిన అవసరాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించినట్లు తెలిసింది.




# ఆదిబట్ల పోలీస్ స్టేషన్ లో మానవత్వం పరిమళించింది....!

**మహేశ్వరం ప్రతినిధి క్రైమ్ మిర్రర్** ఆదిబట్ల పోలీస్ స్టేషన్ లో మానవీయతకు, కుటుంబ బంధానికి నిదర్శనంగా నిలిచే ఘటన చోటుచేసుకుంది. గత ఐదు సంవత్సరాలుగా ఆదిబట్ల పోలీస్ స్టేషన్ లో విధులు నిర్వహిస్తూ స్టేషన్ పనితీరులో తనదైన ముద్ర వేసిన మహిళా కానిస్టేబుల్ అఖిలకు స్టేషన్ సిబ్బంది ఘనంగా శ్రీమంతం నిర్వహించారు. ఆదిబట్ల ఇన్‌స్పెక్టర్ ఎస్.రమేష్ ఆధ్వర్యంలో గురువారం పోలీస్ స్టేషన్ ఆవరణలో ఈ వేడుకను అత్యంత ఆప్యాయంగా నిర్వహించారు. తొమ్మిది నెలల గర్భవతిగా ఉన్న అఖిలకు సంప్రదాయబద్ధంగా చీర, పసుపు కుంకుమ, సారె అందజేసి, పండ్లు, పూలతో ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ ఎస్. రమేష్ మాట్లాడుతూ, పోలీస్ శాఖలో మహిళా సిబ్బంది పాత్ర ఎంతో కీలకమని కొనియాడారు. "ఆదిబట్ల పోలీస్ స్టేషన్ లో మహిళా సిబ్బంది విధి నిర్వహణ అభినందనీయం. పురుషులతో సమానంగా ప్రతి విభాగంలో సమర్థవంతంగా విధులు నిర్వహిస్తున్నారు. బందోబస్తు విధులతో పాటు స్టేషన్ రోజువారీ కార్యకలాపాల్లో, ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించడంలో వారి పాత్ర కీలకం" అని తెలిపారు. మహిళా సిబ్బంది సేవలను గుర్తించి, వారికి అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు ఎల్లప్పుడూ ముందుంటామని, పోలీస్ స్టేషన్ అంటే కేవలం విధులు నిర్వహించే ప్రదేశం మాత్రమే కాదని, ఒక కుటుంబమని, అందరితో ఆప్యాయతగా ఉండటమే తమ విధానమని స్పష్టం చేశారు. మహిళా సిబ్బంది పట్ల కుటుంబ సభ్యుల తరహాలో ఆప్యాయత చూపిస్తూ పోలీస్ శాఖలో మానవీయ విలువలకు ప్రాధాన్యత ఇవ్వడం పట్ల సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. పోలీస్ శాఖలో ఇలాంటి వేడుకలు విధుల్లో మరింత ఉత్సాహాన్ని నింపుతాయని పలువురు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, సబ్ ఇన్‌స్పెక్టర్లు, ఏఎస్ఐలు, మహిళా పోలీస్ సిబ్బంది, స్టేషన్ సిబ్బంది పాల్గొని అఖిల దంపతులకు శుభాకాంక్షలు తెలిపి, చిన్నారి ఆరోగ్యంగా జన్మించాలని ఆకాంక్షించారు.

## నారాయణ నామస్మరణతో నాదబ్రహ్మోత్సవం....

**క్రైమ్ మిర్రర్ కొండాపూర్:** అన్నమాచార్య భావనా వాహిని ఆధ్వర్యంలో దసరా శరన్నవరాత్రుల సందర్భంగా నిర్వహిస్తున్న నాదబ్రహ్మోత్సవం-26లో భాగంగా అక్టోబర్ 16న జరిగిన సంగీత కార్యక్రమం భక్తులను అలరించింది. ప్రముఖ గాయకులు, లిటిల్ మ్యూజిషియన్స్ అకాడమీ వ్యవస్థాపకులు శ్రీ రామాచారి కొమండూరి అన్నమయ్య సంకీర్తనలను ఆలపించి సంగీతానందంలో ముంచెత్తారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఆధ్యాత్మిక వక్త శ్రీ వి.ఎస్.ఆర్. మూర్తి, ఈటీవీ మాజీ ప్రోగ్రామ్ ప్రొడ్యూసర్ శ్రీ అజయ్ శాంతి మాట్లాడుతూ, అన్నమయ్య సంకీర్తనల ప్రచారానికి పద్మశ్రీ డా. శోభారాజు గారు చేస్తున్న కృషి అభినందనీయమని ప్రశంసించారు. అన్నమయ్యపురం భవిష్యత్తులో మరో తిరుపతిలా ఆధ్యాత్మిక క్షేత్రంగా వెలుగొందాలని ఆకాంక్షించారు. ఈ ఏడాది 'ధైర్య' పురస్కారాన్ని డా. సత్య సింధుజ గారికి మాజీ ఉపరాష్ట్రపతి శ్రీ ఎం. వెంకయ్య నాయుడు, డా. డి. నాగేశ్వర్ రెడ్డి గార్ల సమక్షంలో ప్రదానం చేయనున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు. ఈ కార్యక్రమం చివరలో స్వామివారికి మంగళహారతి సమర్పించి, భక్తులకు ప్రసాద వితరణ చేశారు.